క్లుప్తంగా

కార్యవర్గం ఎన్నిక



ఖానాపురం : ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ మండల కార్యవర్గాన్ని జిల్లా కార్యవర్గ సభ్యుడు కోటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తడుగుల స్వామి, ప్రధాన కార్యదర్శిగా తూడి కుమార స్వామి, ఉపాధ్యక్షుడుగా జాడి కిరణ్, కోశాధికారిగా పోలసాని రవి, గౌరవ అధ్యక్షుడుగా బయ్య శ్యామ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు స్వామి మాట్లాడారు. ప్రభుత్వం ఫొటో, వీడియోగ్రాఫర్లకు రుణాలు అందించి ఆదుకోవాలని కోరారు. అనంతరం కార్యవర్గాన్ని సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు ఫరీద్, వెంకటేశ్, కార్తీక్, శ్రీనివాస్, రమేశ్, రాజు, నాగరాజు, శ్రీనివాస్, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

పర్వతగిరి : మండలంలోని ఇస్లావత్‌తండా ప్రాథమిక పాఠశాల నుంచి బదిలీ అయిన ఉపాధ్యాయుడు మహ్మద్ మొహసీన్, స్కూల్‌కు బదిలీపై వచ్చిన హెచ్‌ఎం శ్రీధర్‌లను మాజీ సర్పంచ్ రమేశ్‌నాయక్, మాజీ జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ సర్వర్ శుక్రవారం శాలువాతో సన్మానించారు. అనంతరం రమేశ్‌నాయక్, సర్వర్ మాట్లాడారు. ఉద్యోగులకు బదిలీలు సహజమన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు అక్కల రమేశ్, అనిల్‌కుమార్, నాయకులు జాటోతు భద్రు నాయక్, అనిల్, సంతోశ్, సర్దార్ పాల్గొన్నారు.

వనభోజనాలు

పర్వతగిరి : వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని కాంక్షిస్తూ మండల కేంద్రానికి చెందిన మాల కుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రజలు వనభోజనాలకు వెళ్లారు. మైసమ్మ తల్లికి మొక్కులు చెల్లించి యాటపోతులను బలి ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మాదుగుల రాజు, మాజీ వార్డు సభ్యులు నాగుల కుమారస్వామి, చీదురు తిరుపతి, కుల సంఘం పెద్దలు నాదారపు నర్సయ్య, చిదురు యాకయ్య, చెనమాల నర్సయ్య, పటేల్ నవీన్, నాదారపు వెంకన్న, యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

రాయపర్తి : మండలంలోని రాగన్నగూడెంలో శుక్రవారం సాయంత్రం ఎదురెదురుగా వచ్చిన రెండు ద్విచక్ర వాహనాలు ఒకదానికి మరొకటి ఢీకొనగా ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనలో ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తున్న వెంకటేశ్, మహేందర్, అనిల్ గాయాల పాలవగా వారిని స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

సారా విక్రేతల రిమాండ్

రాయపర్తి (వర్ధన్నపేట) : మండలంలోని తిర్మలాయపల్లి, పెర్కవేడు, రాయపర్తి గ్రామాల్లో నాటుసారా విక్రయిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ సీఐ స్వరూప తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆమె పత్రికలకు వివరాలు వెల్లడించారు. పెర్కవేడుకు చెందిన మహమ్మద్ సలీమ, తిరుపతి, యాకయ్య, తిర్మలాయపల్లికి చెందిన చందురాజ కొమురమ్మ నాటుసారా విక్రయిస్తుండగా జైలుకు పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై సరిత, సిబ్బంది శ్రీధర్, రమేశ్ బాబు, శరత్ బాబు, బాబు, రవి, మానస పాల్గొన్నారు.

రేపు ఈవీఎం వ్యతిరేక జాతీయ సదస్సు

నర్సంపేట : రేపు (ఆదివారం) హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఈవీఎం వ్యతిరేక జాతీయ సదస్సు నిర్వహిస్తామని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (బొజ్జా తారకం) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జన్ను సాంబయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈవీఎం వ్యతిరేక జాతీయ ఉద్యమం మరో చారిత్రక పోరాటాన్ని తలపించనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికల అక్రమాలు, ఈవీఎం అవకతవకలు సహా అనేక కుట్రలు, కుతంత్రాలు, మోసాలతో అడ్డదారుల్లో గెలవడం వల్లే దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం సర్వనాశనం అవుతున్నట్లు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో అన్ని ఎన్నికలను బ్యాలెట్ పేపర్ ద్వారానే నిర్వహించాలనే డిమాండ్‌తో ఈనెల 21న తలపెట్టిన జాతీయ సదస్సును జయప్రదం చేయాలని కోరారు.

రేపు జిల్లా మహాసభ

నర్సంపేట : పట్టణంలోని ఎస్‌ఆర్ కళాశాలలో రేపు (ఆదివారం) గౌడ జన హక్కుల పోరాట సమితి (మోకుదెబ్బ) అనుబంధ మహిళా సంఘం జిల్లా మహాసభ నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల కవిత రమేశ్ గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కువ మంది గౌడ మహిళలను పోటీ చేసేలా చైతన్యవంతం చేయడమే మహాసభ ముఖ్యఉద్దేశ్యమని పేర్కొన్నారు. మహిళలు విద్య, సామాజిక, రాజకీయ రంగాలతోపాటు ఆర్థిక స్వావలంభన సాధించే దిశగా పరపతి సంఘాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. మహాసభకు గౌడ మహిళా ఉద్యోగులు, విద్యావంతులు, మేధావులు, ప్రజాప్రతినిధులు, గృహిణిలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

శుభ్రతతో వ్యాధుల నుంచి రక్షణ



ఖానాపురం : పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



చెన్నారావుపేటలో..



దుగ్గొండి : మల్లంపల్లిలో..



రాయపర్తి : ఊకల్‌లో..

ఖానాపురం : వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటిస్తే సీజనల్ వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని అశోక్‌నగర్-1 పల్లె దవాఖానా వైద్యుడు సతీశ్, అశోక్‌నగర్-2 రాకేశ్, ధర్మరావుపేట పల్లె దవాఖానా వైద్యురాలు సునీత స్పష్టం చేశారు. మండలంలోని బాలుతండ, అశోక్‌నగర్ గ్రామాల్లో శుక్రవారం ఏర్పాటు చేసిన వైద్యశిబిరాల్లో ప్రజలకు వారు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇళ్ల ఆవరణల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని, తదితర సూచనలు చేశారు. కార్యక్రమాల్లో హెల్త్ అసిస్టెంట్ భాస్కర్, సిబ్బంది సుజాత, రమాదేవి, విజయ, విజయరాణి పాల్గొన్నారు.

చెన్నారావుపేట : మండలంలోని పాపయ్యపేట, కోనాపురం, అమీనాబాద్ గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పీహెచ్‌సీ వైద్యురాలు సరోజ ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం మాట్లాడారు. జ్వరం వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. దోమల నివారణకు దోమతెరలు ఉపయోగించాలని తెలిపారు. శిబిరంలో డాక్టర్ భవానీ, సూపర్‌వైజర్ సువార్త పాల్గొన్నారు.

దుగ్గొండి : మండలంలోని మల్లంపల్లిలోని కేజీబీవీలో, శివాజీనగర్‌లో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో 212 మందికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. పలువురి రక్త నమూనాలు సేకరించారు. వైద్యాధికారి కిరణ్‌రాజ్ మాట్లాడారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని చెప్పారు. కార్యక్రమాల్లో కేజీబీవీ ప్రిన్సిపాల్ మంజుల, సిబ్బంది సాంబయ్య, మనోజ, సంధ్యారాణి, సలోమి పాల్గొన్నారు.

రాయపర్తి : మండలంలోని ఊకల్‌లో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సౌమ్య పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ భీమానాయక్, ఏఎన్‌ఎంలు శారా, జ్యోతి, ఆశావర్కర్లు సుకని, వసుంధర, సునీత తదితరులు పాల్గొన్నారు.

మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి



నెక్కొండ : భిక్షాటన చేస్తున్న జీపీ కార్మికులు

నెక్కొండ : గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని తెలంగాణ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకటయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ యూనియన్ ఆధ్వర్యంలో పట్టణంలో జీపీ కార్మికులు, ఉద్యోగులు శుక్రవారం భిక్షాటన చేసి నిరసన తెలిపారు. అనంతరం వెంకటయ్య మాట్లాడారు. జీఓ నంబర్ 51తో కార్మికులు, ఉద్యోగులతో అన్ని పనులు చేయించడం దారుణమన్నారు. ఏడు నెలలుగా వేతనాలు అందక దుర్భర పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. జీఓ నంబర్ 51ని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, జీఓ నంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం మండల ప్రధాన కార్యదర్శి చిలకలపల్లి వీరస్వామి, ఉపాధ్యక్షుడు సాయిలు, నాయకులు మదార్, తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరి : మండల కేంద్రంలో జీపీ సిబ్బంది భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షుడు నకరికంటి రాంచందర్ మాట్లాడారు. జీఓ నంబర్ 51ని రద్దు చేయాలని, జీపీ సిబ్బందిని పర్మినెంట్ చేసి రూ.26 వేల వేతనం చెల్లించాలని, పీఎఫ్‌తోపాటు ఈఎస్ఐ వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కుమార్, నాయకులు ఈదుల వెంకన్న, చీదురు రజిని, బాబు, సురేశ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో శ్రమకు తగిన గుర్తింపు



సమావేశంలో మాట్లాడుతున్న ఝాన్సీరెడ్డి

● పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి

రాయపర్తి : కాంగ్రెస్‌లో శ్రేణుల శ్రమకు తగిన గుర్తింపు ఉంటుందని ఆ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి భరోసా ఇచ్చారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు నిత్యం ప్రజల్లో ఉంటూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని సూచించారు. గ్రామాల్లో పేరుకుపోయిన సమస్యలను నాయకుల దృష్టికి తీసుకొచ్చి అభివృద్ధికి బాటలు వేయాలని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అవలంభించాల్సిన విధివిధానాలపై దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులకు అందించడానికి కృషి చేయాలని తెలిపారు. తద్వారా పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. సమావేశంలో తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్, పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సోమనాథ ఆలయ కమిటీ చైర్మన్ తిరుమల కృష్ణమాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం



నర్సంపేట : క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



నర్సంపేట రూరల్ : ముత్తోజిపేటలో..



చెన్నారావుపేటలో..



నల్లబెల్లి : నారక్కపేటలో..



దుగ్గొండి : రేకంపల్లిలో..

నర్సంపేట : ఎన్నికల హామీ మేరకు రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసిన నేపథ్యంలో పట్టణంలోని సొసైటీ కార్యాలయ ఆవరణలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ బొబ్బాల రమణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి తక్కళ్లపల్లి రవీందర్‌రావు మాట్లాడారు. కార్యక్రమంలో డీసీసీ బ్యాంకు మేనేజర్, వైస్ చైర్మన్ మేర్గు శ్రీనివాస్, సొసైటీ డైరెక్టర్లు బైరి జనార్దన్‌రెడ్డి, దామెర రవి, కోమన్ల రాజిరెడ్డి, పాలాయి రాము, మహేశ్వరం మాజీ సర్పంచ్ మాదుగుల నిరంజన్‌రెడ్డి, విడిమాలపు మధు, తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేట రూరల్ : మండలంలోని ముత్తోజిపేటలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మాధవరెడ్డి చిత్రపటాలకు నాయకులు, కార్యకర్తలు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సాంబరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు బూర సుమన్, విజేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేట : మండలంలోని లింగగిరి, పాపయ్యపేట గ్రామాల్లో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మాధవరెడ్డి చిత్రపటాలకు నాయకులు, రైతులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి, పులి మంజుల అశోక్ మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు కంచ ప్రభాకర్, చిందం కుమార్, మాజీ సర్పంచ్‌లు మాదారపు భాస్కర్, బొమ్మనపల్లి గణేశ్, చంద్రయ్య, సొసైటీ డైరెక్టర్ మజ్జిగ రాంబాబు, కన్నం వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

నల్లబెల్లి : మండలంలోని నారక్కపేట, లెంకాలపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులు సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమాల్లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ వైనాల అశోక్, మామిండ్ల ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

దుగ్గొండి : మండలంలోని రేకంపల్లిలో నాయకులు, కార్యకర్తలు, రైతులు సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మాధవరెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఒలిగే నర్సింగరావు మాట్లాడారు.

పాలకుల తీరుతో విద్యావ్యవస్థ నిర్వీర్యం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రమేశ్, నాయకులు

నర్సంపేట : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుతో విద్యావ్యవస్థ నిర్వీర్యమవుతోందని ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా కార్యదర్శి జన్ను రమేశ్ ఆందోళన వెలిబుచ్చారు. ఆగస్టు 1, 2 తేదీల్లో హైదరాబాద్‌లోని ఓంకార్ భవన్‌లో నిర్వహించనున్న ఆ సంఘం జాతీయ జనరల్ మాడీ సమావేశాల కరపత్రాలను పట్టణంలో శుక్రవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. విద్యావ్యవస్థ అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతుండగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భ్రష్టు పట్టిస్తున్నాయని విమర్శించారు. పాఠశాలల్లో, కళాశాలల్లో కనీస సౌకర్యాలు లేవని తెలిపారు. పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందని ద్రాక్షలా మారిందన్నారు. కేంద్ర ప్రభుత్వం రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని మాట మార్చడం సిగ్గుచేటన్నారు. నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలని, నీట్ పరీక్ష పేపర్ లీకేజీపై కేంద్ర ప్రభుత్వం విద్యార్థులకు న్యాయం చేకూర్చాలని, రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని, గురుకులాలు, ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, ప్రభుత్వ పాఠశాలలకు భవనాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నూతన భవనం మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ దాని ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గూడ సాయిరాం, నర్సంపేట డివిజన్ కార్యదర్శి మార్త నాగరాజు, నాయకులు రాకేశ్, వంశీ, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

సంగెం : విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని ప్రొఫెసర్ విజయ్‌కుమార్ సూచించారు. మండలంలోని గవిచర్లలోని మోడల్ స్కూల్‌లో కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులతో విద్యార్థులకు ఇన్నోవేషన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌పై శుక్రవారం నిర్వహించిన శిక్షణకు ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. సమస్యలను అధిగమించడానికి ఆలోచనలను మెరుగుపరుచుకోవడం ఎలా అనే అంశంపై అవగాహన కల్పించారు. ప్రతీఒక్కరు తమలోని సృజనాత్మకతను వెలికితీసేలా పాఠశాలలోని అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను వినియోగంచుకోవాలని చెప్పారు. కిట్స్ కళాశాల మోడల్ స్కూల్‌తో అనుసంధానమై విద్యార్థులకు రోబోటిక్స్‌పై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు గ్రేస్ శాంతి, శ్రీనివాస్, అభినయ్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ముజీబుర్ రెహ్మాన్, అటల్ టింకరింగ్ ల్యాబ్ ఇన్‌చార్జ్ నీలాద్రి, తదితరులు పాల్గొన్నారు.

రహదారులపై గస్తీ ముమ్మరం చేయాలి

మామునూరు: వరంగల్-ఖమ్మం ప్రధాన జాతీయ రహదారిపై పోలీసు గస్తీని ముమ్మరం చేయాలని మామునూరు ఏసీపీ తిరుపతి సూచించారు. బొల్లికుంట క్రాస్ రోడ్డు సన్‌షైన్ బార్ ఎదురుగా బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాద సంఘటన స్థలాన్ని రోడ్ అనలిసిస్ గ్రూపు (ర్యాగ్) టీమ్ సభ్యులు, పర్వతగిరి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌తో కలిసి ఏసీపీ తిరుపతి శుక్రవారం మధ్యాహ్నం పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదం జరిగిన తీరును ర్యాగ్ కమిటీ సభ్యులు, ఏసీపీకి సీఐ శ్రీనివాస్ వివరించారు. అనంతరం రోడ్డు ప్రమాదాలపై ఏసీపీ స్పందించి మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ఆర్టీఏ జంక్షన్ సమీపం నుంచి ఐనవోలు క్రాస్ వరకు రక్షణ చర్యలు చేపట్టాలన్నారు.

పట్టుదలతో చదివితే ఏదైనా సాధించొచ్చు

ఐనవోలు : పట్టుదలతో చదివితే ఏదైనా సాధించవచ్చని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు తెలిపారు. మండలంలోని ఒంటిమామిడిపల్లి గ్రామంలో రోటరీ క్లబ్ జిల్లా బాధ్యుడు కోరె చంద్రమౌళి సహకారంతో 8వ తరగతి చదువుతున్న విద్యార్థినులు సాయి నైమిశ, హేమలత, రంజిని, ప్రియకు శనివారం సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రధానోపాధ్యాయుడు ప్రతాపరత్న కుమార్ ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. పాఠశాలకు ఆటస్థలం, లైబ్రరి తదితర మౌలిక సదుపాయాలు సమకూర్చేందుకు దాతలు ముందుకురావాలని కోరారు. విద్యార్థినులు క్రమశిక్షణతో చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రజుమంలో ఏఎంసీ చైర్మన్ సకినాబీ, నాయకులు పెండ్లి నవీన్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యవసాయ కూలీ మృతి

దుగ్గొండి : ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై వ్యవసాయ కూలీ మృతి చెందిన ఘటన మండలంలోని పొనకల్‌లో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన అమృత బాయి (65) కూలీ పనులకు వెళ్లి సాయంత్రం వర్షం కురుస్తుండగా ఇంటికి చేరుకుంది. ఈ సందర్భంగా ఇంట్లోకి వెళ్లి లైట్ వేయడానికి స్విచ్ ఆన్ చేస్తున్న క్రమంలో ఆమె విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. వర్షంలో వచ్చిన ఆమె తడి బట్టలతో ఉండగానే స్విచ్ వేయడం వల్లే విద్యుదాఘాతానికి గురైనట్లు తెలుస్తోంది. మృతురాలికి కొడుకు ఉన్నాడు.

విరాళం



చెన్నారావుపేట : మండలంలోని కోనాపురం గ్రామంలోని గుట్ట మీద చేపట్టిన శ్రీ లక్ష్మీనర్సింహ స్వామి ఆలయ నిర్మాణానికి స్థానిక శ్రీ రామాంజనేయ స్వామి వీఓఏ గ్రూప్ బాధ్యులు శుక్రవారం రూ.లక్షా 40 వేల 116 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా అర్చకుడు శివకృష్ణ, ఆలయ కమిటీ సభ్యుడు మండల అనిల్ మాట్లాడారు. శ్రీ రామాంజనేయ స్వామి వీఓ గ్రూప్‌లోని 28 సంఘాల సభ్యులు ఐక్యంగా భారీ మొత్తంలో విరాళం అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆలయ నిర్మాణానికి ప్రజలు విరాళాలు అందించి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వీఓఏ హైమ, అధ్యక్షురాలు రమ, కార్యదర్శి లక్ష్మీ, ఉపాధ్యక్షురాలు ప్రతిభ, కోశాధికారి నజీమా, సహాయ కార్యదర్శి నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి



నర్సంపేట : రైతుల సమస్యలను పరిష్కరించాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన రాష్ట్ర కమిటీ సమావేశానికి వారు అతిథులుగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ వర్తింప చేయాలని, రైతులకు వ్యవసాయ పరికరాలు పూర్తి సబ్సిడీ ద్వారా అందించాలని, ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని, ఎరువులు, విత్తనాలు సబ్సిడీతో అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు ఆబర్ల రాజన్న, కోడి సోమన్న, ఊట్ల నాయక్, రామ్మూర్తి, కాంతారావు పాల్గొన్నారు.

అంగడిలో చినుకు పడితే చిత్తడి



బురదలోనే సాగుతున్న క్రయవిక్రయాలు

పర్వతగిరి : చినుకు పడితే మండల కేంద్రంలోని అంగడి చిత్తడిగా మారుతోంది. మండలంలోని 33 గ్రామాలకు మండల కేంద్రంలో ఒకేచోట అంగడి ఏర్పాటు చేశారు. ప్రతీ సోమవారం నిర్వహించే అంగడికి సుమారు 3-4 వేల మంది వచ్చి కూరగాయలు, పండ్లు కొనుగోలు చేయడం పరిపాటి. కాగా అంగడి ప్రాంతం ఏటా వర్షాకాలంలో బురదమయంగా మారుతోన్న దుస్థితి నెలకొంది. అంగడికి వచ్చే జనాలు అడుగు తీసి అడుగు వేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఏటా రూ.6 లక్షలకుపైగా ఆదాయం వస్తున్నా ప్రభుత్వం, అధికారులు మౌలిక సదుపాయాల కల్పనకు చొరవ చూపడం లేదంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మొరం పోసి లెవలింగ్ చేయాలి



సంతలో వర్షాకాలంలో కూరగాయలు విక్రయించేందుకు వెళ్లిన సమయంలో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వ్యాపారులు కూర్చోవడానికి కూడా ఇబ్బందులు తప్పడం లేదు. గ్రామపంచాయతీ అధికారులు స్పందించి గట్టి మొరం పోయించి లెవలింగ్ పనులు చేపట్టాలి.

-భిక్షపతి, గ్రామస్తుడు, దౌలత్‌నగర్

అంగడిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి



అంగడిలో మౌలిక సదుపాయాలు కల్పించాలి. వర్షాకాలంలో బురదమయంగా మారుతున్న క్రమంలో రోడ్డు నిర్మించి సమస్యను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించాలి. వర్షపునీటిని బయటకు మళ్లించేందుకు ప్రత్యేక కాల్వలు ఏర్పాటు చేయాలి. తాగునీటి, పూర్తిస్థాయి లైటింగ్ ఏర్పాటు చేయాలి.

-వెంకన్ననాయక్, గ్రామస్తుడు, గోరుగుట్టతండా

రోడ్డుకు మరమ్మతు చేయిస్తాం



రోడ్డును పరిశీలిస్తున్న ఎంపీడీఓ

చెన్నారావుపేట : మండలంలోని అమీనాబాద్ గ్రామంలోని మామిండ్లపల్లి కాలనీలో బురదమయంగా మారిన రోడ్డుకు మరమ్మతు చేయిస్తామని ఎంపీడీఓ తెలిపారు. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆ రోడ్డు బురదమయంగా మారడంతో కాలనీవాసులు ఈనెల 17న నిరసన తెలిపిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆ రోడ్డును ఆయన శుక్రవారం సందర్శించి మాట్లాడారు. కాలనీ నుంచి వ్యవసాయ బావుల వద్దకు వెళ్లే దారి కాగా ట్రాక్టర్లు ప్రయాణిస్తుండడంతో దారి బురదమయంగా మారిందని తెలిపారు. మొరం పోయించి రోడ్డును బాగు చేస్తామన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి నిట్టు ఉన్నారు.